# కస్తూరి

అయ్యగారూ! అయ్యగారూ! అంటూ రెండుసార్లు పిలిచాడు చంద్రయ్య. చూస్తూనే నేనేమీ మాట్లాడలేదు. నావాలకం కనిపెట్టి ఆక్షణం ఊరుకున్నాడు. చంద్రయ్య మెదడులో ఏదో చటుక్కున మెరిసినట్లుంది.

బాగా ఆలోచనల్లో ఉండిపోయారే! అన్నాడు కొంచెం వ్యంగ్యంగా.

చప్పున తలెత్తి చూశాను. పెదవుల మీద కొస్తున్న చిరునవ్వును బిగించేశాను. అతని ఉద్దేశ్యం నాకు అర్థమయింది. నిన్న సాయంత్రం నేను ఇన్స్పెక్షన్ ముగించుకొని ఇంటికివస్తుంటే దార్లో ఇద్దరు ఆడ వాళ్ళు తారసిల్లారు. అప్రయత్నంగా వాళ్ళతో మాట్లాడవలసి వచ్చింది.

నిజానికి మాట్లాడాలనిపించిందికూడా. చంద్రయ్య నా మొహంలోకి చూసి వెకిలిగా నవ్వాడు. నేనంటే ఎంతో అభిమానం. నా పెళ్లినిగురించి నేపడుతున్న బాధలో అతనుకూడా నాకు తెలియకండానే కొంతపాలు పంచుకుంటూ వుంటాడు. అయ్యగారికి మంచి అమ్మగారు దొరకాలని అతని ఆదుర్దా. కాని ఈ విషయాల్లో అతను ముఖాముఖిగా జోక్యం కలుగజేసు కోవాలంటే ధైర్యం చాలటం లేదు. అతను చప్రాసి. నేను ఇన్‌స్పెక్టర్ని. నాతోపాటు ఈవూరు సహకార సంఘాల ఇన్‌స్పెక్షన్‌కు వచ్చాడు. నాకనుసన్నలలోమెలగాలిసినవాడు! అసలు నిజానికి ఆ ఆడపిల్ల లని గురించి నాకేఅభిప్రాయమూ లేదు, వాళ్ళెవ్వరూ నాకు తెలీదు.అసలు ఆవూరు నాకు క్రొత్త. కాని చంద్రయ్య మనస్సులో వాళ్ళని గురించిన ఆలోచనే వుందని నా గట్టినమ్మకం. అందుకనే ఆలోచనల్లో వున్నారే' అన్నాడు. అతనిచేత ఇంకా రెండుమాటలు చెప్పించాలని ప్రయత్నం చేశాను. అతను మాట పూర్తిగా తప్పించేసి ఇంకా ఇన్‌స్పెక్షన్ ఎన్నా ళ్ళుండి ? అన్నాడు.

కాని నామనస్సు ఇవ్వాళ ఎందు చేతనో నా పెళ్ళి గురించి ఆలో చిస్తోంది. ఎన్నాళ్లనుంచో చేస్తున్న ఈ ప్రయత్నం సఫలం కాకపోవ టానికి కారణమేమిటని నాలో నేను తర్కించుకుంటున్నాను. ఎప్పుడు ఈ ఆలోచన వచ్చినా, కస్తూరి నాకళ్లల్లోకి రాక మానదు. ఎప్పుడో చిన్నప్పుడు చూశాను, అంతే! నవ్వుతూనూ, విచారంగానూ కనిపిస్తూ వుంటుంది. నామనస్సు కలవర పడిపోతూ వుంటుంది. చిన్నప్పుడున్న సన్నిహితం క్రమ క్రమంగా వయస్సుతో పెరగాలిసింది సన్నగిలి పోయింది. ఇప్పుడు ఎక్కడుందో! ఎట్లావుందో! ఊహకందని విషయాలు.

ఇన్‌స్పెక్షన్, త్వరలోనే పూర్తి చేద్దాంలే అన్నాను, నిరామయంగా. అన్నట్లు చెప్పటం మరిచేపోయాను! ఇవ్వాళ దేశముఖ్ గారింట్లో పెళ్ళి. వెళ్ళాలి అన్నాడు శుభలేఖ అందిస్తూ.

అవును అయనకూతురి పెళ్లి కాదూ, ఇవ్వాళ అనుకున్నాను. చప్పున నా ఆలోచనలు పటాపంచలయి పోయినాయి. ఏమిటో పెళ్లికి వెళ్లాలని పించింది. చంద్రయ్య నాకంటె కూడా అమితంగా సంతోషించాడు. ఇన్‌స్పెక్షన్ అనంగానే నిజానికి అతనికే ఎక్కువతాకిడి.

“సరే బయలుదేరు. ఆయన ఈ ఊళ్లో పెద్ద, గౌరవంగా పెళ్లికి పిలిస్తే, వెళ్లకపోతే బాగుండదు,” అన్నాను.

నేను సరిగ్గా పందిరి దగ్గరకు వెళుతుండగానే, నన్ను ఆహ్వానించి లోపలికి తీసుకెళ్లారు. పెళ్లిపందిరి శోభాయమానంగా కళకళ లాడి పోతోంది. నామనస్సు ఎంతో ఆనందంతో నిండిపోయింది. వేసిన కుర్చీలమొదటి వరసలో మూడోకుర్చీలో చాల హాయిగా కూర్చున్నాను. పెద్దలు పిన్నలు వచ్చేస్తున్నారు. చాల హడావిడిగా వుంది. అంత భారీఎత్తుగా ఆ ఊళ్లో ఏ పెళ్ళీ జరగనేలేదుట! గాజుల గలగలలు శరీరాన్ని గగుర్పొడిచేస్తున్నాయి. ఒక్క సారిగా తలెత్తి నాలుగుమూలలా పరికించి చూశాను, ఆడవాళ్లు మగవాళ్ళ సంఖ్యకంటె రెట్టింపున్నట్లు న్నారు. ఆ చీరల తళతళల్లో నా కళ్ళు జిగేలుమంటున్నాయి. ఆడ వాళ్ళు మహా అందమైనవాళ్ళు అనిపించింది, అట్టే కళ్ళు నిలిపి ఎవరి వైపూ చూడకూడదు. సభ్యతా లక్షణం కాదు, నాకు తెలుసు. అయితే ఏం! మనం చెయ్యరాని పనులు సగం తెలిసే చేస్తాం. ఇదీ అంతే. అనుకున్నాను.

కన్యాదాన ఘడియ సమీపిస్తోంది. మండపం వైపుకు మెడ సాగించి కళ్లు నిలిపేశాను. పెళ్ళికూతుర్ని, మేనమామ కాబోలు చెయ్యి పట్టుకుని

నడిపించి తీసుకు వస్తున్నాడు. పెళ్ళికూతురు బాగా కులుకుతోంది. అందరికళ్ళు ఆ అమ్మాయి మీదే పడ్డాయి. అట్లాగే నేనుకూడా పెళ్ళి కూతురు ఎట్లావుంటుందో అన్నట్లు తేరపార చూశాను. బాగానే వుంది. చాలా అందంగావుంది. ఈ అందం, సగం అలంకారంతో వచ్చిందే. దేశముఖ్ గారమ్మాయ్! ఏం తక్కువ? నా కేమిటో ఆ క్షణంలో పెళ్ళి కొడుకు అమ్మాయికి తగినవాడు కాడని అనిపించింది. నాకు పెళ్ళి కాలేదుకదా అని అట్లా అనిపించిందో ఏమో ! సంబంధం నిశ్చయం అయి పోయిన తర్వాత మనం చేసేదేమీలేదు. చంద్రయ్యమీద చెడ్డ కోపం వచ్చింది. గొంగళిమోస్తరు. ఎక్కడ వేస్తే అక్కడే! అసలు ఈ ఊరు వచ్చినతర్వాత మంచీ చెడ్డా తెలుసుకోవటం-ఈ ఊళ్లో ఎవరేమిటో తెలుసుకోవటమూ ఏమీలేదు. ముందరగా తెలుసుకుంటే ఎవరి అదృష్టం ఎట్లావుందో ఎవరు చెప్పగలరు. వచ్చిన ఆలోచనలు దూదిపింజలు లాగా ఎగిరిపోతున్నాయి. అట్లాగే పెళ్ళికూతురి వైపుకు చూస్తూ యిచ్చిన కాఫీ తాగేస్తున్నాను. నా కళ్ళు యిట్టే నిలిచిపోయినాయి. ఆ క్షణంలో మతి పోయినట్లనిపించింది ! మనం జీవితంలో చప్పగా ఓడిపోయినాం అను కున్నాను. తెగబాధ పడ్డాను. అసలు ఈ పెళ్ళికి రాకపోతే బాగుండేది అనిపించింది. మానసిక వ్యధ లేనిపోయింది కాని తెచ్చుకున్నట్లయింది. ఇంక నాకు పనేం సాగుతుంది! నిద్రేం పడుతుంది! అసలు ఈ ఊళ్లో క్షణం ఉండకూడదు. ఉన్న ఫళంగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. హఠాత్తుగా నేను లేవంగానే అందరికళ్లు నామీద పడడం, తలొక ప్రశ్న వెయ్యడం, ఇదంతా లేనిపోని ఛిద్రం అనుకుని ముళ్ళమీద కూర్చున్నట్లు ఉండిపోయాను.

కన్యాదానం చేస్తున్నారు. వధువు తల్లిదండ్రులు, దేశముఖ్. ఆయన భార్య, లేచి నిలబడ్డారు. నా గుండె ఆగినంత పనయింది. కాళ్ళూ,

చేతులూ కాయ్యబారి పోయినాయి. కళ్లు నిలిచి పోయినాయి. గుండె దడ దడమంటోంది. విద్యుత్తులాగ శరీరంలోకి ఒక ఊపు వచ్చి తీవ్రంగా దెబ్బ తీసింది. పైకి వినిపించేటంత ఆయాసపడి పోతున్నాను. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. పూర్తిగా అలసి పోయాను. కనురెప్పలు టప టప కొట్టుకొంటున్నాయి. దేశముఖ్ భార్య ముచ్చటగా నవ్వుతూ, పెళ్ళి కూతుర్ని తన దగ్గరకు తీసుకుంటోంది.

'కస్తూరి...' అన్న మాటలు అస్పష్టంగా వినిపించాయి. నానోట్లోనే కస్తూరి అనే అక్షరాలు నలిగిపోయినాయి. పైకి రాలేదు. బాగా తపన పడ్డాను. ఉక్కిరి బిక్కిరయి పోతున్నాను. కస్తూరి కన్యాదానం చేసేసింది. కస్తూరి తన కూతురి పెళ్ళి కూడా చేసేసింది. పెదిమ బిగపెట్టేసి గట్టిగా తల వంచేసుకున్నాను. ఆ క్షణంలో నేను ఏంచేయాలో ఎక్కడికి వెళ్ళాలో అర్థం కాలేదు. ఆపసోపాలు పడుతూ కుర్చీలో పడివున్నాను. యాంత్రికంగా వాళ్ళిచ్చే ఆతిధ్యం స్వీకరిస్తున్నాను. అంతమందిలో నేనెవరినో పట్టించుకునే అవసరం ఎవ్వరికీ లేదు, ఎవరైనా వుంటే కస్తూరే! అయితే ఆమె పరాయిదయిపోయింది. అంతకంటె ఏమను కోవాలో కూడా అర్థం కావటం లేదు.

పెళ్లి సందడి తగ్గిపోంతోది. ఒక్కొక్కరే మెల్లి మెల్లిగా వెళ్లి పోతున్నారు. నేను అట్లాగే కూలబడి పోయాను. గుండె నిబ్బరం చేసుకుని, హఠాత్తుగా వచ్చిన ఈ దెబ్బలు తట్టుకుని, మెల్లిగా కోలు కుంటున్నాను. అంతా వెళ్లిపోయారు. నేను మెల్లిగా లేచి నిల బడ్డాను.

కస్తూరి కళ్లు నిలిపి నిశ్చేష్టురాలయి పోయింది. నా మొహంలోకి తలెత్తి చూసింది. ఆమెకు ఆ క్షణంలో ఏమేమి జ్ఞాపకం వచ్చి వుంటాయో నాకు తెలుసు. ఆమె స్మృతి పథంలో ఎలాంటి ఊహలు చెలరేగు

తున్నాయో కూడా నేను ఊహించ గలను. క్షణంలో రెప్ప వాల్చేసింది, తల వంచేసుకుంది. క్రింది పెదిమను, పళ్ళతో గట్టిగా పట్టుకుని, తల విదిలించేసుకుని చప్పున లోపలికి పోయింది. ఎంతో వ్యధ పడి వుంటుంది. తీవ్రంగా బాధపడి వుంటుంది. నా హృదయ భారాన్ని ఆపుకోలేక పోయాను. చకచక అడుగులు వేస్తూ వెళ్లిపోయాను.

ఇంట్లోకి వెళ్లంగానే, చంద్రయ్య ఎదురుగా వచ్చేసి, పెళ్లి బాగా జరిగిందాండి అన్నాడు ఎంతో సంతోషంగా.

'ఊ...' అన్నట్లు తల వూపాను.

చంద్రయ్య నా మనస్సు గ్రహించినట్టు లేదు. విసుగు పుట్టేటట్లు ప్రశ్నలు వెయ్యటం మొదలు పెట్టాడు. చిరాకు పడ్డాను.

చంద్రయ్య అయితే ఎప్పుడు ఇంటికి వెళ్లి పడదామా అనే ఆదుర్దాలో వున్నాడు. నేనవుతే ఆ తొందల్లో...ఆ ఊరు వదిలి పెట్టి వెళ్ల బుద్ధి పుట్టటం లేదు. మెదడులోకి దొంతర్లు దొంతర్లుగా ఆలోచనలు వచ్చేసి కలవర పెడుతున్నాయి. మనస్సు పరిపరి విధాల పోతోంది.

"చంద్రయ్యా!...ఇప్పుడే అట్లా వెళ్ళొస్తాను...." అంటూనే చక చక సాగిపోయాను.

* * *

'పెళ్ళి బాగాజరిగింది.' అన్నాను. నా గొంతులో గీర వచ్చింది.

'ఆహహా,' అంటూ నవ్వాడు దేశముఖ్.

పెళ్ళిసందడేమీ కనిపించటం లేదు. అంత పెద్దగదిలో మేమిద్దరమే కూర్చొని వున్నాం.

'అమ్మాయిని, అత్తారింటికి పంపించేశాం' పెద్దభారం వదిలి పోయినట్లు మాట్లాడాడు.

కస్తూరీః అని గట్టిగా పిలిచాడు. పిలుస్తుంటేనే దగ్గుకూడా వచ్చేసింది ఒంగుఒంగున. ఊరికే ఆయాసపడి పోతున్నాడు. రొప్పుతున్నాడు. ఏం ప్రమాదం వస్తుందో అని భయపడి పోతున్నాను, ఆయన స్థితి చూస్తూ.

కస్తూరి చిరునవ్వు మోహం పెట్టుకుని గ్లాసుతో నీళ్ల వయ్యారంగా తీసుకు వస్తోంది.

నేను తలెత్తి కస్తూరి మొహంలోకి చూశాను. ఆమెకూడా నా కళ్ళల్లోకి చూసింది, నేను వణికి పోయాను. నిబ్బరంగా, బరువుగా అడుగులు వేసుకుంటూ మాదగ్గరకు వచ్చేసింది. భర్తకు నీళ్లుఅందిచ్చింది. ఆయన గడ గడ తాగేస్తున్నాడు. ఆయన ప్రక్కనే కూర్చుంది. గుండె మీద రాస్తోంది.

ఆ కస్తూరీ ...తగ్గింది...కొంచం తగ్గింది...., అంటూ ఆయాస పడుతున్నాడు దేశముఖ్.

కస్తూరి కళ్లల్లోకి చూస్తుంటే క్షణంలో భయాంగానూ వుంది. మరు క్షణంలో జాలిగానూ వుంది. నేను చూసినప్పటి కస్తూరి కాదు, ఇప్పుడు పూర్తిగా మారి పోయింది.

ఎంత మెల్లిగా మాట్లాడేది! ఎవరైనా మగవాళ్లు వాకిట్లో కనిపిస్తే, ఇట్టే తలుపేసుకుని లోపలికి చక్కాపోయేది. బక్క పల్చటి శరీరం, పోషణలేక నలిగిపోయిన ముఖం, యౌవ్వనం, బీదరికం, మధ్య కస్తూరి నలిగిపోయి చాల బాధ పడిపోయేది. కస్తూరి అని నేను ఎప్పుడు

అప్యాయంగా. పిలిచినా, ఆమెకు ఎంతో ధైర్యం వచ్చినట్లు నావంక చూసేది.

ఆమె అంటే నాకు ప్రేమ వుంది. సానుభూతి వుంది. అప్యాయత వుంది. ఆశయం మంచిదే. కాని ధైర్యం లేదు. సాహసమంటే నాకు అప్పట్లో తెలీదు. నేను కాస్తంత ధైర్యం చెయ్యక పోబట్టి కస్తూరి నాకు యెంతో దూరంగా వెళ్ళి పోయింది. మరి యీనాడు ఒంటి నిండా నగలు, పట్టు చీరెలు. కాస్త లావు బారింది. కళ్ళలో తీక్షణత బాగా కనిపిస్తోంది. బాగా చలాకిగా వుంది. మాట తడుముకోకుండా మాట్లాడ కలదు. మగవాళ్ళంటే జంకు లేదు. ఒకరంటే లక్ష్యం లేదు. ఎంతో చాక చక్యం నేర్చుకున్నట్లున్నది. నాకు ఎంతో ఆశ్చర్యం వేసింది. నిజంగా ఆకస్తూరేనా అనిపించింది.

'కాసేపు మెదలకండా పడుకోండి' అంటూ చివాలున లేచింది.

'చూడు' అంటూ దేశముఖ్ ఏదో చెప్పబోయాడు.

ఒక్క క్షణం చప్పున ఆగింది. నా వైపుకు చూపించి 'కాఫీ, అన్నాడు.

'అవన్నీ నేను చూస్తాను. మీరు పడుకోండి' ఒక్క గుక్కలో అన్నది కస్తూరి.

నేను ఉక్కిరి బిక్కిరయి పోయాను.

కస్తూరి చర చర లోపలికి వెళ్లి అట్టే కాఫీ తీసుకువచ్చింది. దేశముఖ్ కళ్ళు మూసుకున్నాడు.

అయన నిద్రలేస్తాడు, ప్రక్కగదిలోకి రండి అన్నట్లు నన్ను సంజ్ఞచేసి పిలిచింది.

ఆ కాఫీ కప్పును అట్లాగే పట్టుకొని లేచి నిలబడ్డాను. నా చేతిలోంచిం కప్పును అందుకుంది. గబ గబ ముందుకు నడిచింది. వెనకాలే నేను కూడా పరుగెత్తాను. నేను కూర్చున్న సోఫాలోనే ప్రక్కగావచ్చి కూర్చుంది.

"ఇక్కడికెట్లా వచ్చారు..."

నేను చెప్పేశాను.

మా అమ్మా, నాన్న నా బరువును వదిలించేసుకున్నారు. ఇప్పుడు వాళ్ళ పనీ హాయిగానే వుంది. నాకంటె పెద్దది ఆయనకో కూతురుంది. ఆ అమ్మాయిపెళ్లి మొన్న చేశాం. ఈ జీవితం ఇట్లా గడిచిపో వాల్సిందే:...నా జీవితం ఇట్లా గడిచిపోవాల్సిందేనా...: వెక్కి వెక్కి ఏడుస్తూ నా వళ్లోకి వచ్చిపడింది.

నా కేం చెయ్యాలో తోచలేదు. కస్తూరితల మెల్లిగా నా రెండు చేతుల్తో పైకి ఎత్తాను. బాగా ఏడుస్తోంది. చెక్కిళ్లమీద కన్నీటిని తుడి చేశాను. ఆమె రెండు చెక్కిళ్ళను, నా రెండు చేతుల్తో పట్టుకుని కస్తూరీ అని ఆమె కళ్లల్లో నా కళ్ళు పెట్టి చూశాను. నేను ఉద్రిక్తుణ్ణయి పోయాను. ఆమె ఆవేశం ఆపుకోలేక పోయినట్లుంది. పెద్దలైటు ఆర్పి చిన్నది వెలి గించింది.నన్ను ఆమె బాహుబంధాలతో కట్టేసింది. కదలనీయలేదు. ఆమె రొమ్ములు బరువునా నా హృదయంమీద తాకుతున్నాయి, ఆమె నిట్టూర్పులో వేడి గాడ్పులు వేస్తున్నాయి, నన్ను మైకంలో కప్పేసింది. కస్తూరి నన్ను ఇంత గాఢంగా ఇప్పటికే ప్రేమిస్తోందన్న విషయం నాకు తెలియదు: సన్నటి చినుకులు దబదబ రేకుల మీద చప్పుడయినాయి. మేఘాలు క్రిందకు దూకుతూన్నట్లు బెదరిస్తున్నాయి. సన్నజాజి లతలాగ కస్తూరి నన్ను పెనవేసుకుని పోయింది. నా ఒళ్ళు నాకుతెలియలేదు.

మర్నాడు ఇన్స్పెక్షను పూర్తి చేసుకుని, చంద్రయ్యకు పైళ్ళు అప్పగించి నేను వెనకాలే నడుస్తున్నాను. సూటు బూటు వేసుకుని నీటుగా ఒక యువకుడు చకచక నడిచి పోతున్నాడు. నన్ను చూసి హలో అన్నాడు. నేను చిరునవ్వు మొహం పెట్టి పలకరించాను. ఆ వూళ్లో నీటుగా డ్రెస్సు వేసుకున్న వాళ్ళు కనిపిస్తే ఒకర్నొకరు పలకరించటం ఆచారం కాబోలు. నా విషయం నేను చెప్పాను. అతను చదువుకుంటున్నాడుట కాలేజీలో. రోజూ సాయంత్రానికి ఇంటికి వచ్చేస్తాడుట చివరి రైలులో. బాగా పరిచయస్థునిలాగా ఇవ్వాళ మా ఇంటికి భోజనానికి రండి అన్నాడు చప్పున. నాకు చెడ్డ ఆశ్చర్యంగా వుంది. మీరెవరో నాకు తెలుసులెండి. రండి పరవాలేదు మా ఇంటికి అని గట్టిగా బలవంతం చేశాడు. ఆయనతో పాటే నడిచాను తీరా దేశముఖ్ గారింటి వద్ద ఆగేశాము.

ఏమిటి ఆగిపోయారు అన్నాడు అతను.

అబ్బే! ఏంలేదు. అంటూనే ఒకడు గేశాను.

అదే మా ఇల్లు అన్నాడు, నా గుండె ఆగినంత పనయింది.

ఆ!, అన్నాను ఆశ్చర్యంగా. లోపలికి వెళ్లాం.

దేశ్ముఖ్ సోఫాలో కూర్చున్నాడు. ప్రక్కనే కస్తూరి ఆయన బుజాలమీద ఆనుకుని పడుకుంది. రేడియో తగ్గించి, మెల్లిగా తాను కూడా ఆలాపన చేస్తోంది.

'హలో! నాథ్...!' అన్నది కస్తూరి అతన్ని ఓరకంటితో చూస్తూ.

అసలు నేనొక మనిషిని, అతని ప్రక్కనే ఉన్నాను అనే మాటే లేకుండా నాథ్తో కస్తూరి గడ గడ మాట్లాడేస్తోంది.

నాథ్ అయితే కాస్తంత ఇరకాటంలో పడ్డట్టయింది. నన్ను పరిచయం చెయ్యడానికి రెండు మూడుసార్లు ప్రయత్నంచేసి విఫలు డయ్యాడు.

కస్తూరి గబగబ లోపలికి వెళ్లి రెండు చేతులతో కాఫీని తెచ్చి మా ఇద్దరికి చెరొకటి అందిచ్చింది. దభాలున వెళ్లి దేశముఖ్ ప్రక్కన, కూలబడింది.

దేశముఖ్, కస్తూరి బుగ్గ మీద ముద్దు పెట్టు కున్నాడు. నాథ్ పక పక నవ్వాడు, కస్తూరి పక పక నవ్వింది.

నవ్వని వాడనల్లా నేనొక్కడినే!

నాథ్ లోపలికి వెళ్లాడు. కస్తూరి చెంగున ఒక్క గంతువేసింది. చివరకు నేనూ, దేశముఖ్ మిగిలి పోయాము. కూర్చోండి అంటూ పరామర్శ చేశాడు.

నాథ్ ఇంట్లోంచి వస్తూనే, నువ్వు కూడా రావయ్యా భోజనానికి అన్నాడు దేశముఖ్ వంక చూస్తూ.

దేశముఖ్ నవ్వాడు నాకు భోజనమేమిటన్నట్లు. 'ఇవ్వాళ ఆయన భోజనం చెయ్యర్లే', అంటూ కస్తూరి ఒక గ్లాసు పాలు తెచ్చి భర్తకు అంది చ్చింది.

ఓ ప్రేమ్...ఇంకేమటి చూస్తున్నావు ? మీ స్నేహితుణ్ణి కూడా పిలా...ఓ మూల వడ్డించేస్తే! అన్నది కస్తూరి.

నన్ను భోజనానికి పిలిచాడు. మేము ముగ్గురం కూడా అన్నం ముందర కూర్చున్నాం. కస్తూరి ఎడంచేయి తిప్పేశే స్తోంది. కుడి చేత్తో తాను కావిస్తోంది. నాథ్ ఒకటి రెండు సార్లు నావంక చూశాడు. నేనేమను కుంటానో ఏమో! నీకంటె నాకే ఎక్కువ పరిచయం కస్తూరితో అని లోపల అనుకున్నాను.

భోజనాలవంగానే సావిట్లోకి వచ్చేశాం గిర్రున. నాథ్, కస్తూరి ఒకే సోఫాలోకి వెళ్లి కూర్చున్నారు. నేను వెళ్లి ప్రక్కనే ఇంకో సోఫాలో

కూర్చున్నాను, ఇంకాధోరణికి అంతులేదు. నాథ్ పక పక నవ్వటం, కస్తూరి ఇంకా ఎక్కువగా నవ్వటం.

దేశముఖ్ ఆయాస పడుతూనే కట్టించిన పల్లు బైట పెడుతున్నాడు. అతను చేతిలో ఏదో పుస్తకం తీసుకుని కూర్చున్నాడు. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటున్నది ఆయన వినిపించు కున్నట్లు లేదు. చదువుతూ చదువుతూనే కునికిపాట్లు పడుతున్నాడు.

'ఇంక ఆయనకు నిద్ర వచ్చేసింది...' అన్నాడు నాథ్ నవ్వుతూ, అవును నిద్రవేళ కాదామరి!... అన్నది కస్తూరి ఓరకంటితో చూస్తూ.

నేవస్తాను అన్నాను, మేం వస్తున్నాంలే! వాకిటిదాకా అంటూ కస్తూరి, నాథ్, ఇద్దరూ కూడా వచ్చారు నాతోపాటే.

ఆమె వంక ఒక్కసారిగాచూసి పెద్ద నిట్టూర్పు విడిచి వెళ్ళి పోయాను.

ఎట్లాగైనా అసలు విషయమేమిటో తేల్చు కోవాలనుకున్నాను. కస్తూరితో ఒంటరిగా మాట్లాడాలి. నా రక్తం ఉడికిపోతోంది. ఆమె ప్రవర్తన ఏమీ బాగాలేదు. ఎంత ముసలివాడయినా అతను తన భర్తే! పరాయి మగవాడితో ఏమిటా ఎకసెక్కాలు? అర్థం పర్థం వుండక్కర్లేదూ! ఆ నాథ్ ఎవడు ? వాడు అంతు కనుక్కుంటా! వాడిష్టం వచ్చినట్లు ప్రవర్తించటమేనా! హద్దూ పద్దూ లేకుండా సిగ్గూ భిడియం విడిచేసి ఇట్లా బజారు పాలవటం! నా ఉద్రేకంలో నేను అనేకం ఆలోచించాను. ఏమైనా కాని కార్య రూపం దాలుస్తేనే ఏ ఆలోచనకైనా విలువ వుండేది. అని తమాయించుకుని వూరుకున్నాను.

చంద్రయ్య తీవ్రంగా సణుగుడు మొదలు పెట్టాడు ఇంక ఇంటికి వెళ్లిపోదామంటూ. అనుకున్నదాని కంటే ఇంకా ఎక్కువ రోజులు వున్న

కథా నిలయం
889



మాటనైతే నిజమే! కాని తప్పనిసరిఅయింది. ఇనస్పెక్షనుకు ఒక రోజు ముందూ వెనకా అవుతుందు. చంద్రయ్యకు అర్థంకాదు. అయితే ప్రాదేయ పడ్డారు. వాళ్ళ కుటుంబం ఎల్లుండే వచ్చేస్తున్నారుట. ఆవేళ్టికి తాను ఇంటికి వెళ్లాలి అని ఎంతో బ్రతిమాలుకున్నాడు. నేను వీల్లేదంటే వీల్లేదని చెప్పేశాను. నా మాట కాదని తాను మాత్రం ఏం చెయ్యగలుగుతాడు. తప్పని సరిగా ఉండిపోయాను.

నాకవుతే ఇంకో విషయం మీద ధ్యాసే పోవటంలేదు. మధ్యలో నాథ్ ఒక డొచ్చి అనవసరమైన ఇబ్బందులు. ఇరకాటాలు తెప్పిస్తున్నాడు. పాపం కస్తూరికి నేనంటే ఎంతో. ప్రేమ అతని ఎదుట నోరు విప్పలేక పోయింది. అతను ఏదో మత్తుమందు చల్లి ఆమెను వశం చేసుకొన్నాడు. వాడు లేకుండా చూసి కస్తూరిని కలుసుకోవాలి అనుకున్నాను. సరాసరి బయలుదేరి వెళ్లాను.

దేశముఖ్ వాకిట్లో పచార్లు చేస్తున్నాడు. కస్తూరి లోపల కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది. నన్నుచూసి చప్పున లేచి పుస్తకం మూసేసింది. నావంక ఎంతో ప్రేమగా చూసింది. నా కళ్లు గిర్రున తిరిగి పోయినాయి.

కస్తూరి! నిన్ను చూస్తుంటే నాకడుపు తరుక్కు పోతోంది!. అన్నాను ఏమీతోచక.

ఎందుకండి అంత జాలి అన్నది కస్తూరి నవ్వుతూనే.

వీపు మీద కొట్టినట్టయింది.

నీకు అసలు వెనుకటివేవీ జ్ఞాపకం లేనట్లుంది! అన్నాను.

'ఉపయోగం లేనివి గుర్తు పెట్టుకుంటే ఏమిటి ప్రయోజనం? చటుక్కున అనేసింది.

"నీ ఉద్దేశం నా కర్థం కాలేదు."

"నా కసలు ఉద్దేశమేమీ లేదు. అందులోను మీకు అర్థంఅవాల్సింది అంత కంటేనూ లేదు,'' అన్నది నవ్వుతూ. ''అంటే!'' అన్నాను.

నాకు చాల హాయిగా వుంది. కావలసినంత డబ్బు, పెద్ద భవనం, చుట్టూ తోట, బోలెడు నగలు, నాకేం లోపం. అయితే... అంటూ ఆపేసింది.

అవును, నాకు తెలుసు కస్తూరీ అంటూ ఎంతో నిబ్బరంగా అన్నాను.

"నాకుఒక్కటే దిగులు. అయనకు దగ్గు తగ్గటంలేదు. ఎన్ని మందులు యిప్పించినా తగ్గటం లేదు. ఏవేళప్పుడు ఏమవుతుందో అని భయంగా వుంది... అంతే." కళ్లనీళ్లు పెట్టుకుంది.

నేను నిశ్చేష్టుణయిపోయాను. నోట మాట లేదు. ఆమె వైపుకే బిత్తర చూపులు చూస్తూ కూర్చున్నాను.

"మీరు నాకు ఒక్క సహాయం చేసి పెట్టండి'' అన్నది తడబడుతూ.

"ఏమిటి......ఎంతో బరువుగా అన్నాను".

"ఏంలేదు. ఆయనకు దగ్గుతగటం లేదు, దానికి మీరు ఏ మంచి డాక్టరునైనా పిలుచుకొస్తారా?" నా కళ్లలోకి చూచింది.

"ఆయన మాట సరే! నీకేమీ అక్కర్లేదా" ఎంతో దీనంగా అడిగాను.

నాకేమీ అక్కర్లేదు. నాకు అన్నీ వున్నాయి. నాకేమీ అక్కర్లేదు..." ఎంతో ధైర్యంగాను, నమ్మకంగాను అన్నది.

నాకు మాటలు లేవు. ఇంకా పైన మాట అనటానికి తోచలేదు.

'నే వెళ్లివస్తాను' అంటూ లేచాను.

'నేను చెప్పిందిమాత్రం జ్ఞాపకం వుంచుకోండి' అన్నది. గేటుదాకా వస్తూ.

నేను చివరి సారిగా ఆమె మొహంలోకి చూసి, ముందుకు సాగాను. నాథ్ అప్పుడే వాకిట్లోంచి వస్తున్నాడు. నేను గేటు దగ్గరకు వెళ్లేటప్పటికి నాథ్, కస్తూరి, లోపల గదిలోకి వెళ్లి పోయారు.

దేశముఖ్ వరండాలో పచార్లు చేస్తున్నాడు. ఒక్కసారి ఆ భవనం వైపుకు చూసి చక చక ఇంటికి వచ్చేశాను.

ఇదిగోనండి అంటూ చంద్రయ్య ఓ కవరు నాకు అందిచ్చాడు.

"...నువ్వుచేసిన ఇన్‌స్పెక్షన్ చాలు. వెంటనే బయలుదేరి రావాల్సింది" అంటూ హెడ్‌ఆఫీసునుంచి వచ్చిఎక్స్‌ప్రెస్ ఉత్తరం అది.

(ఆంధ్రభూమి 16-10-1960)